


నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం
నూరేళ్ళ తెలుగు కథకు

## 90వ దశకం నుంచి

# నా కథల్లో ఆర్ద్రత కరవయింది!!

- పెద్దిభొట్ల సుబ్బరామయ్య

దాదాపు యాభై ఏళ్లనుంచి కథలు రాస్తున్న పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారు కరుణ రసాన్ని పండించడంలో సిద్ధ హస్తులు. వీరి కథలు చదివితే ద్రవించని హృదయం, చెమ్మగిల్లని కళ్లు ఉండవు. **1938** డిసెంబరు **15**న గుంటూరులో పెద్దిభొట్ల కృష్ణ శాస్త్రి, వెంకటసుబ్బమ్మలకు జన్మించిన ఈయన ఇప్పటి వరకూ సుమారు **300** కథలు, తొమ్మిది నవలలు రాశారు. వీరి కథలు పలు భారతీయ భాషలలోకి అనువదించబడ్డాయి. ఇంగ్లీషులోకి, రష్యన్‌లోకి కొన్ని కథలు అనువాదమయ్యాయి. ఇటీవల ఇంగ్లీషులో ఒక కథల సంపుటిని వెలువరించారు. తెలుగు విశ్వవిద్యాలయం వారి ఉత్తమ కథా రచయిత పురస్కారం, రావిశాస్త్రి పురస్కారం, గోపీచంద్ స్మారక పురస్కారం, పులుపుల శివయ్య స్మారక సాహిత్య పురస్కారం అందుకున్న పెద్దిభొట్ల సుబ్బ రామయ్య గారి వృత్తి, ప్రవృత్తి గురించి ఆయన మాటల్లోనే..

### నీళ్లంటే భయం..

నాకు నీళ్లంటే భయం.. ఇప్పటికీ.. ఇప్పటికీ నన్ను ఒక కల వెంటాడుతూ ఉంటుంది. నిజానికి అది కల కాదు. నా బాల్యంలో జరిగిన సంఘటన.. అప్పటికి నాకు ఆరేడేళ్ల వయసు. మానాన్న స్టేషన్ మాస్టరు. నెల్లూరు దగ్గర్లోని లంక లకొడేరులో ఉండేవాళ్లం. మా నాన్న పనిచేసే స్టేషన్లోనే పోర్టర్ ఉండేవాడు. అతనికి ఇద్దరు కొడుకులు. కవలలు. రాముడు, లక్ష్మణుడు. దాదాపు నా వయసు వాళ్లే. నన్ను చిన్నమేస్టారు..చిన్న మేస్టారు అనేవాళ్లు. మేం ముగ్గురం కలసి బడికి పోయేవాళ్లం. ముగ్గురం జట్టుగా ఉండేవాళ్లం. ఒకరోజు నేనూ, రాముడూ, లక్ష్మణుడూ బడినుంచీ సాయం కాలం ఇంటికి వస్తున్నాం. దారి మధ్యలో ఒక కాలవ ఉంది.

దానిలో గేదెలు మేపుకునే కుర్రాళ్లు ఇద్దరు కొట్టుకుని పోతున్నారు. దీన్ని చూడగానే రాముడు నీళ్లలో దూకి ఆ ఇద్దరినీ ఒడ్డున వేశాడు. అయితే తను కొట్టుకు పోయాడు. కొట్టుకుపోతూ రెండు చేతులూ పైకెత్తి రక్షించమని అరవడం ఇప్పటికీ నా కళ్లలో మెదులుతూ ఉంది. అప్పటినుంచీ నాకు నీళ్లంటే భయం. నీళ్లలోకి దిగాలంటే భయం. ఈ సంఘటన ఇప్పటికీ నాకు తరచూ కలలో వస్తూ ఉంటుంది.

### చేతబడి చేశారు..

రాముడి చావు ఒక్కటే కాదు.. మరో రెండు సంఘటనలు నా స్మృతిపథంలో చెరగకుండా ఉండిపోయాయి. నెల్లూరునుంచి మేం బెజవాడ వచ్చాం. మాకు బెజవాడలో స్వంత ఇల్లు ఉండేది. మేం మొత్తం ఐదుగురం. ఒక అన్నయ్య. ఇద్దరు అక్కయ్యలు. తర్వాత నేను, తమ్ముడు. మా అన్నయ్య నాకన్నా వయసులో చాలా పెద్దవాడు. మేం బెజవాడ రాగానే అన్నయ్యకు అనారోగ్యం వచ్చింది. రక్తం కక్కుకుని రెండు రోజుల్లోనే చనిపోయాడు. నా కళ్లెదుటే.. చూస్తుండగానే ప్రాణాలు పోయాయి. తర్వాత ఏడాదికే నాన్నగారు పోయారు. దీంతో మేం ఉంటున్న ఆ ఇంట్లో దెయ్యం ఉందని, మా ఇంట్లో వాళ్లకు చేతబడి చేశారని ప్రచారం జరిగింది. దీంతో మా అమ్మ మమ్మల్నందరినీ తీసుకుని ఒంగోలు చేరుకుంది.

### వేయిపడగలులో వర్ణనలు చదవలేదు..

ఒంగోలులో థర్డ్ ఫారమ్ (1952లో) వరకు చదువుకున్నాను. భారతీయ మార్కండేయ శర్మ అనే టీచర్ ఉండేవాడు. చాలా పొడవుగా ఉండేవాడు. ఆయన సంఘసంస్కర్త. హోమియో వైద్యుడు. అప్పట్లో విడో మ్యారేజ్ చేసుకున్నాడు. నేనంటే ఆయనకు చాలా ఇష్టం. నన్ను ప్రాణంలా చూసుకునేవాడు. భారతం చదవమనేవాడు. అర్థం కాకపోయినా చదవమనేవాడు. విశ్వనాథ వేయిపడగలు ఇచ్చి చదవమన్నాడు. మూడు రోజుల్లో చదివేశాను. అయితే అందులో వర్ణనలు మాత్రం చదవలేదు. తను బహుభాషా కోవిదుడు. తనకు ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు, పార్శీ వచ్చు.. ఇంటర్ అయిపోయేప్పటికే నేను భారత, రామాయణాలతో పాటు మన పూర్వకవుల గ్రంథాలు, ఆంగ్లసాహిత్యం చాలా చదివాను.

### మూడే సినిమా హాళ్లు

ఫోర్త్ ఫారమ్ అంటే ఇంటర్.. అప్పట్లో నెల్లూరు, బందరులో మాత్రమే కాలేజీలు ఉండేవి. మా అదృష్టం కొద్దీ ఒంగోలులో సి.ఎస్. ఆర్ కాలేజీ ప్రారంభించారు. అక్కడే ఇంటర్ చదివాను. మాకు ధారా రామనాథశాస్త్రి, కె.వి.ఆర్., ఎస్.ఎస్.ఆర్. శర్మ లెక్చరర్లు. ధారా రామనాథ శాస్త్రి బ్రహ్మచారి. మద్రాసునుంచి వచ్చి ఇక్కడ పనిచేసేవాడు. నన్ను ఆత్మీయంగా చూసుకునేవాడు. కొవ్వలి జంపన్న నవలలనుంచి వేలవేల పుస్తకాలు చదివాను. రాజమణి ఇంగ్లీష్ లెక్చరర్. విక్టర్ హ్యూగోనుంచి ప్రపంచ ప్రసిద్ధి పొందిన ఇంగ్లీషు నవలలన్నీ నా చేత చదివించాడు. మాకు కాలేజీ అయిపోయాక చాలా సమయం మిగిలిపోయేది. అప్పట్లో ఒంగోలులో మూడు సినిమా హాళ్లు మాత్రమే ఉండేవి. దీంతో కోట్లకోట్ల పేజీలు చదివేశాను.

### తింటే ఆయాసం.. తినకుంటే నీరసం


నాన్న, అన్న చనిపోవడంతో కుటుంబం పోషణ అమ్మకు భారంగా మారింది. నేను ఉద్యోగం చేయాల్సిన పరిస్థితి. అయితే ఎం.వి.ఆర్ శర్మ నన్ను పిలక పట్టుకొని లాక్కెళ్లి విశ్వనాథ సత్యనారాయణ ఇంట్లో వేశాడు. 1954-56లో విజయవాడలోని ఎస్.ఆర్.ఆర్. కాలేజీలో బి.ఏ. ఆనర్స్ చదివాను. అప్పట్లో అది ప్రైవేట్ కాలేజీ. దానికి గౌరవ అధ్యాపకుడిగా నెలకు వంద రూపాయల జీతంతో విశ్వనాథ సత్యనారాయణ పని చేసేవారు. డిగ్రీలో మాకు అత్యంత గొప్ప తెలుగు, ఇంగ్లీషు సాహిత్యం పాఠ్యాంశాలుగా ఉండేవి. అప్పట్లో స్పెషల్ తెలుగు చేసే మమ్మల్ని అనాగరికులుగా, అస్పృశ్యులుగా చూసేవారు. విశ్వనాథవారు మాకు ఏరోజూ కాలేజీలో పాఠాలు చెప్పలేదు. అయితే రోజూ కాలేజీకి వచ్చేవారు. ఒక రోజు ''ఈరోజు తినలేదురా.. నీరసంగా ఉంది.. పాఠం చెప్పలేను. ఇంటికి రండి'' అనేవారు. మరో రోజు ''ఈ రోజు ఎక్కువ తిన్నానురా.. ఆయాసంగా ఉంది.. పాఠం చెప్పలేను.. ఇంటికి రండి'' అనేవారు. మేం మూడుగంటలకు వారి ఇంటికి వెళ్లేవాళ్లం. చుట్టుగుడిసెలో కూర్చుని మధ్యాహ్నం మూడు గంటలనుంచి సాయంత్రం ఏడుగంటల వరకు పాఠాలు చెప్పేవారు.

### 124 రూపాయల జీతంతో ప్రారంభం

బి.ఏ. అయిపోయింది. మా ఆర్థిక పరిస్థితి బాగులేదు. ఎం.ఏ. చేయాలని నేను నిరాహార దీక్ష మొదలు పెట్టాను. ఆ సమయంలో ఇంటికి ఒక జాబు వచ్చింది. దాని సారాంశమేమంటే విజయవాడలోని లయోలా కాలేజీలో ట్యూటర్‌గా చేరమని. నెలకు 124 రూపాయల జీతం. ఇక కాలేజీకి వెళ్లక తప్పలేదు. నాకు బాగా గుర్తు.. నేను 5 జూలై 1957న కాలేజీకి పోవాలి. అప్పట్లో ప్రైవేట్ బస్సులుండేవి. గుణదల దగ్గర కాలేజీ. బస్సులో కూర్చున్నాను. ఎంతకూ బస్సు కదలలేదు. పక్కనే 'విజయా టాకీస్'. అదులో 'పథేర్ పాంచాలి' సినిమా ఆడుతోంది. బస్సుదిగి 9.30గంటల షోకి వెళ్లాను. సినిమా అయిపోయాక మధ్యాహ్నం ఇంటికి వెళ్లాను. కాలేజీకి పోయొచ్చానని చెప్పాను. ఆ రోజు శనివారం. ఇక సోమవారం తప్పలేదు. కాలేజీలో జాయిన్ అయ్యాను. అప్ప









భార్య గీతారాణితో...

ట్లోనే 'వేయిపడగలు' రీ ప్రింట్ అయింది. ఈ సారి కథ వదిలేసి వర్ణనలు మాత్రమే చదివాను. విశ్వనాథవారి కవితా వైభవం తెలియాలంటే వర్ణనలు చదవాల్సిందే!

## పుస్తకాలు ఎందుకు చదవాలంటే..

ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవాలి.. దీని వలన మనకు రెండు ప్రయోజనాలున్నాయి. మొదటిది జీవితం... మనకు అనుభవంలోకి వచ్చిన జీవితం చాలా చిన్నది. అదే పుస్తకాలు చదివితే.. ఒక్కో రచయిత తది ఒక్కో జీవితం.. రకరకాల జీవితాలు తెలుసుకుంటాం. మాలపల్లి నవలగాని, మునిమాణిక్యం రచనలు ఎలా ఉంటాయి? వాటిల్లో ఎలాంటి జీవితాలు ప్రతిఫలించాయి? వీటని చదవడం మనకు మహా వరం కదా! పుస్తకాలు చదవడం వలన మన దృక్పథం విశాలం కావడంతో పాటు హృదయం ఆర్ద్రమవుతుంది. డికెన్స్ 'టేల్ ఆఫ్ టూ సిటీస్'లో చివరి చాప్టర్ లో హ్యూమన్ డాక్యుమెంట్ ఎంతబాగా రికార్డ్ చేశారని. రెండోది భాష.. వెయ్యి నిఘంటువులను ముందరేసుకున్నా భాష రాదు. మాటల్లో తప్పులేకుండా రావాలంటే చక్షురక్షర సంయోగం జరగాల్సిందే. భాష బాగున్న పుస్తకాలను ఎంత ఎక్కువగా చదివితే అంత బాగా మనకూ భాష వస్తుంది.

## సెలవొస్తే దిగులు..

లయోలా కాలేజీ మార్వెల్. చాలా డిసిప్లెయిన్ ఉంటుంది. అందరూ చదువుకోలేకపోయినా కనీసం చూడాల్సిన కాలేజి. అప్పట్లో మాకు వారానికి పన్నెండు పీరియడ్లు ఉండేవి. మో, స్మైల్, నేనూ పని చేసేవాళ్లం. మా ముగ్గురికి పాఠాలు చెప్పడం అయిపోయాక బోల్డంత ఖాళీ ఉండేది. సాహిత్యంపైన చర్చింకునే వాళ్లం. సినిమాలకు వెళ్లే వాళ్లం. సెలవొచ్చిందంటే మాకు దిగులేసేది.

## సుబ్బరామయ్యగారేరీ..

నా మొదటి కథ 'చక్రనేమి' 1958లో రాసి ఆంధ్ర పత్రికకు పంపాను. కుర్రాడిని కదా. వెంటనే వేస్తారని అనుకోలేదు. ఓ రోజు గురువారం సాయంకాలం బజారులో ఆంధ్రపత్రిక తీసుకుని చంకలో పెట్టుకుని ఇంటికి వెళ్లాను. అన్నం తింటూ పుస్తకం తెరిచాను. ఆశ్చర్యం..! సెంటర్ స్ప్రెడ్‌లో బాపుగారి కలర్ బొమ్మతో నా కథ అచ్చయింది. ఆ కథకు పన్నెండు రూపాయలు పంపారు. తర్వాత 'భారతి'లో 'పిరికివాడు' కథ తిరుమల రామచంద్రగారు ప్రచురించారు. నేను పంపిన కథలన్నీ వెంటవెంటనే అచ్చయిపోయేవి. 1961లో ఆంధ్రపత్రికలో నవలల పోటీ పెట్టారు. ఒకే ఒక నవలకు బహుమతి ఇస్తామన్నారు. నేను 'ధ్రువతార' నవల పంపాను. నెలకంతా శివలెంక రాధాకృష్ణగారినుంచి నా నవలను ప్రచురణకు తీసుకుంటున్నట్టు తెలుపుతూ ఉత్తరం, 250 రూపాయల పారితోషకం అందాయి. నిజానికి శింగరాజు లింగమూర్తి నవలకు బహుమతి వచ్చింది. బహుమతి మొత్తం 250 రూపాయలే. అదనంగా మరో 250 కలిపి మా ఇద్దరి నవలలు ఒకేసారి సీరియల్‌గా మొదలు పెట్టారు. నా పరిచయం, ఫోటో కావాలని ఉత్తరం రాశారు. పంపాను. అది చేరకముందే విజయవాడకు శివలెంక రాధాకృష్ణగారు వచ్చారు. ఆంధ్రపత్రిక కార్యాలయంలో దిగారు. నన్ను కలవాలంటున్నారని రామయ్య అనే అతను వచ్చి చెప్పాడు. నేను ఆయన వెంట వెళ్లాను.

"సుబ్బరామయ్యగారు వచ్చారండీ" అన్నాడు రామయ్య.

"ఏరీ.. ఎక్కడ సుబ్బరామయ్యగారు" అన్నారు శివలెంకగారు నా వెనకకు చూస్తూ.

పొడవాటి వ్యక్తి, తెల్లబట్టలు వేసుకుని, తలకు కండువా చుట్టుకుని, చేతిలో కర్ర పట్టుకుని ఉంటానను కున్నారట.

"వీరే సుబ్బరామయ్యగారు" అని రామయ్య నన్ను చూపగానే శివలెంకగారు ఆశ్చర్యపోయారు.

## రెండో పెళ్లి

నాకు పదహారో ఏట పెళ్లయింది. అప్పటికి 'హమిని'కి పన్నెండేళ్లు. ఆ రోజుల్లో మా పెళ్లి ఐదురోజులు జరిగింది. మూడేళ్ల క్రితం తనకు మామూలు జ్వరం వచ్చింది. అపస్మారక స్థితికి వెళ్లిపోయింది. ఆసుపత్రిలో చేర్పించాం. 17 రోజులు పెట్టుకుని వెనక్కు పంపారు. చివరకు చనిపోయింది. చాలా ఆరోగ్యంగా ఉన్న మనిషి ఒక్కసారిగా ఇలా వెళ్లిపోవడంతో నేనెంత డిపెండెంట్‌నో తెలిసింది. నాకు కనీసం సిలెండర్ ఎలా తిప్పాలో కూడా తెలీదు. అగాథంలో పడ్డట్టు అయిపోయింది. పలువురు సాహితీ మిత్రులు వచ్చి పరామర్శించారు. అయినా ఒంటరినే కదా. నాకంటూ ఎవరున్నారు. మా అమ్మాయికి పెళ్లయి హైదరాబాదులో ఉంది. నాకేమో బెజవాడ వదలను మనసు రాదు. అందుకే గత ఏడాది వేలూరి గీతారాణితో నాకు రెండో వివాహం జరిగింది.

## మనసు విరిగితే మొహం చూడను

మనుషులను ఇష్టపడితే ఎంతగా ప్రేమిస్తానో, నచ్చక పోతే అంత దూరంగా ఉండిపోతాను. ఎంత దగ్గరి వ్యక్తి అయినా సరే.. మనసుకు ఛీ అనిపిస్తే.. ఇక వాళ్ల ముఖం కూడా చూడను... నాకు విశ్వనాథ సత్యనారాయణగారంటే ఎంతో ఇష్టం. ఆయన రచనలూ ఇష్టం. చదువుకునే రోజుల్లో ఎప్పుడూ ఆయన ఇంట్లోనే ఉండేవాడిని. 1965లో అనుకుంటాను. గుంటూరు శేషేంద్ర శర్మ నాకు అన్న వరుస. ఆయన రాసిన 'ఋతుఘోష'ను ముందుమాటకోసం విశ్వనాథగారి వద్ద ఇచ్చాము. అదే సమయంలో పుట్టపర్తి సత్యనారాయణగారికి, ఆరుద్రగారికి కూడా శేషేంద్రగారు పంపారు. ముగ్గురి వద్దనుంచీ ముందుమాటలు వచ్చాయి. అయితే ఆరుద్రగారు 'ఋతుఘోష' బాగులేదనే రీతిలో రాశారు. దానిని అలానే అచ్చేసేశాం. అచ్చయ్యాక నేనూ, మా అన్న 'ఋతుఘోష'ను తీసుకుని విశ్వనాథగారింటికి వెళ్లాము. అందులో ఆరుద్రగారి ముందుమాటను చూడగానే వారికి విపరీతమయిన కోపం వచ్చింది. ఆరుద్రను బండబూతులు మాట్లాడుతూ 'ఋతుఘోష'ను విసిరి కొట్టారు. నాకు చాలా బాధయింది. అక్కడినుంచీ ఇద్దరం మౌనంగా వచ్చేశాం. తర్వాత మా అన్న వెళ్లి క్షమాపణ కోరి వచ్చారు. ఇంకో రోజు మేమిద్దరం వాళ్లింట్లో భోంచేస్తుండగా మళ్లీ ఆ 'ముందుమాట' ప్రస్తావన తెచ్చారు విశ్వనాథగారు. నాకెందుకో ఇబ్బంది అనిపించింది. అంతే.. ఆ రోజునుంచి విశ్వనాథగారిని చూడటం, మాట్లాడటం మానేశాను. పదేళ్ల తర్వాత ఆయన చనిపోయిన రోజు మాత్రమే వెళ్లాను. మనసు విరిగితే మొహం కూడా చూడను.. ఇది నా బలహీనత కూడా కావచ్చు.

## నా కథల్లో ఆర్ద్రత లేదు

నా చివరి పుస్తకం 'మంచుబొమ్మ' ఆవిష్కరణ హైదరాబాదులో జరిగింది. కేతు విశ్వనాథరెడ్డి, రాజేశ్వరరావు, పోరంకి దక్షిణామూర్తి, సినీ నటుడు బ్రహ్మానందం, శేషేంద్ర శర్మతో పాటు చాలా మంది హాజరయ్యారు. 'మంచుబొమ్మ'లోని కథలను పొగిడారు. చివర్లో నేను చెప్పాను.., నా ఈ పుస్తకంలోని కథల్లో ఆర్ద్రత లేదని. నిజాన్ని అంగీకరించాలి కదా. నా ముందు కథల్లో లాగా వీటిల్లో సున్నితత్వం, ఆర్ద్రత బదులు కాఠిన్యం చోటు చేసుకున్నాయి. 85 తర్వాత చుట్టు పక్కల సమాజంలో వచ్చిన మార్పులే వీటిల్లో ప్రతిఫలించాయి. కథల్లో, సాహిత్యంలో, మాధ్యమంలో హింసను చూపడం పెరిగిపోయింది. ఇది మన మనసుల్లోకి ఇంజెక్ట్ అవుతోంది. మనం కూడా హింసకు అలవాటు పడుతున్నాం. ఇందుకు నేనూ మినహాయింపు కాదు. అందుకే నా కథల్లో సున్నితత్వం లోపించింది.

## కళ్లు తెరిచేప్పటికి నెల్లూరులో..

నాకు గ్రామీణ జీవితం తెలీదు. నేను కళ్లు తెరిచేప్పటికి నెల్లూరులో ఉన్నాను. అందువలన నా కథల్లో రైతు జీవితం తక్కువ. మానవుడిలో సహజంగా అసంతృప్తి ఉంటుంది. పని జరగకపోతే ఆ అసంతృప్తి ఎక్కువ అవుతుంది. పని జరిగినా అసంతృప్తే. ఫలితం ఉండనీ ఉండకపోనీ ఆ పని మాత్రం చేసేస్తారు. ఏ మనిషీ తృప్తిగా చనిపోడు. తాను చనిపోతానని తెలిస్తే చివరి క్షణంలో కూడా తన అసంతృప్తి వెల్లడిస్తాడు.

## డాలర్ల మాయలో పడిపోయారు

సాగరాంధ్ర ప్రాంతంలో కథా ఉధృతి తగ్గింది. దీనికి కారణం లేకపోలేదు. 20 ఏళ్లలో ఇక్కడ పెను మార్పులు జరిగాయి. కార్పొరేట్ కల్చర్ పెరిగింది. విద్యావ్యవస్థలో రాష్ట్రమంతటా వేళ్లూనుకున్న రెసిడెన్షియల్, కాన్సెప్ట్ స్కూళ్లు మొదట ఇక్కడే పుట్టాయి. దీనికితోడు డాలర్ల కోసం వేట. అందుకోసం చదువులు.. పరుగులు.. ఇక్కడ గుండెచప్పుళ్లు లేవు.. డాలర్ల చప్పుళ్లు మాత్రమే ఉన్నాయి.. ఇప్పుడిక్కడ జీవితం లేదు.. జీవితం లేని చోట మంచి సాహిత్యం ఎలా పుడుతుంది? ఉత్తరాంధ్ర, తెలంగాణ, రాయలసీమ జీవంతో తొణికిసలాడుతున్నాయి..గుండెచప్పుళ్లు వినిపిస్తున్నాయి. అందుకే ఇక్కడినుంచి మంచి కథలు వస్తున్నాయి..



– సుంకోజి దేవేంద్రాచారి

### నచ్చినవి...

**కథ :** నచ్చిన కథ ఒక్కటి కాదు చాలా ఉన్నాయి.
**నవలలు :** మాలపల్లి, కడిమిచెట్టు
**కవులు :** కృష్ణశాస్త్రి, విశ్వనాథ
**సినిమాలు :** బైస్కిల్ థీవ్, సిటీ లైట్స్, పథేర్ పాంచాలి
**హీరోయిన్స్ :** నర్గీస్, సూర్యకాంతం
**హీరోలు:** నాగయ్య, దిలీప్, సైగల్
**వ్యక్తి :** డాక్టర్ పాల్ మార్టిన్

**నాకు నచ్చిన నా కథ**

# స్ప్రింటర్

పెద్దిభొట్ల సుబ్బరామయ్య

ఎవరో కుర్రవాడు రన్నింగ్ రేస్ చేస్తున్నవాడిలా పేవ్‌మెంటు మీద బాణంలాగా 'రివ్వు'న పరుగెత్తిపోతున్నాడు వేగంగా.
రామచంద్రమూర్తి ఒక్క క్షణం ఆగి వెనుదిరిగి చూస్తూ నిలబడ్డాడు. అంతలోనే ఆ కుర్రవాడు కనుచూపు మేర దాటిపోయాడు.
రామచంద్రమూర్తికి నవ్వు వచ్చింది.
వేగంగా పరుగెత్తుతున్న వారెవరిని చూచినా అతడు అలాగే నిలబడి పోతాడు. బొమ్మలా చేష్టలు దక్కి నిలబడిపోయి తర్వాత నవ్వుకుంటాడు.
అతడు మళ్లీ నడవడం ప్రారంభించాడు.
రోడ్ల పక్కన పేవ్‌మెంట్ మీద స్తంభాలకు రకరకాల సినిమా పోస్టర్లు అతికించబడి వున్నాయి. అన్నీ అందమైన అమ్మాయిల బొమ్మలు, హీరో, హీరోయిన్ల గాఢంగా కౌగలించుకొని వున్న దృశ్యాలు. ఒకళ్ళ మీద ఒకరు పడి దొర్లుతున్న దృశ్యాలు.

అతడు మరొక ఫర్లాంగు దూరం నడిస్తే కాని బస్సు స్టాపు చేరుకోలేడు. ఎంత పెందలాడి యింట్లో నుంచి బయలుదేరితే తప్ప బస్సు అంది ఆఫీసుకు చేరుకోవడం కష్టం... అప్పటికి సీతమ్మ ఎంతో పెందలకడనే. బాగా చీకటి ఉండగానే నిద్రలేచి పనులు ప్రారంభిస్తుంది. అవి సర్దుకొని యివి సర్దుకుని వంటకు ఉపక్రమించి ఎంత ఉరుకులు పరుగులు పెడుతూ చెమటలు కక్కుతూ పని చేసినా తొమ్మిది గంటల లోపున వంట తయారు కాదు. నాలుగు మెతుకులు నోట వేసుకుని తాను తయారయ్యే సరికి తొమ్మిదిన్నర అవుతుంది. ఎంత వేగంగా నడచినా బస్‌స్టాప్‌కు చేరుకునేసరికి మరొక పావుగంట. ఆ తర్వాత బస్సుకోసం పడిగాపులు పడి వుండాలి. ఎంతకూ తనెక్క వలసిన బస్సు రాదు. వచ్చిన బస్సులు ఆగకుండానే రివ్వున దూసుకుపోతుంటాయి. ఆ వేళప్పుడు అన్ని బస్సులూ నల్లుల్లాగా, బల్లుల్లాగా కిటకిటలాడుతున్న ప్రయాణికులతో కిక్కిరిసి వుంటాయి. పోనీ ఓపిక చేసుకుని నడిచిపోదామా అంటే ఆఫీసు దగ్గరా దాపూ కాదు. అయిదు కిలోమీటర్ల దూరంలో ఊరికి అవతలి వేపున ఉందది.

'పోనీ ఆఫీసుకు దగ్గర్లో ఏదైనా యిల్లు చూసుకోరాదూ?' అన్నారు చాలామంది.

కాని అక్కడ అద్దెలు తాను భరించలేడు. అక్కడ అద్దెలు చుక్కలంటుతూ వుంటాయి. తన కొచ్చే జీతంలో యిక్కడికే ఎటూచాలక బాధ పడుతున్నారు. ఆఫీసులో కొందరు జల్సారాయుళ్ళు ఉన్నారు. ఖరీదైన బట్టలు ధరించి, ఖరీదైన సిగరెట్లు కాలుస్తూ, అందాల రాముళ్ళలాగా ఘుమఘుమ లాడిపోతుంటారు. కొత్త కరెన్సీ నోటుల్లా పెళపెళ లాడుతుంటారు. కాని వారి దారి వేరు. సీట్లు అటువంటివి. కల్పవృక్షాలు-- కామధేనువులే.....

తన సీటు అటువంటిది కాదు. చాకిరీకి మాత్రం ఏమీ తక్కువ ఉండదు. టన్నుల కొద్దీ ఫైళ్లు పేరుకుపోతుంటాయి. ఎంతచేసినా తరగని పని - ఫలితం మాత్రం నెల తిరిగేసరికి వచ్చే ఆ జీతపు రాళ్లే. అందులో బోలెడన్ని కట్లూ, కత్తిరింపులు. చేతిలో పడే మొత్తం ఆనందం కలిగించదు సరికదా ఆందోళన కలిగిస్తుంది.

అతడు కోటు వేసుకుంటాడు. పాత కాలపు పాత కోటు. 'మీకేమండి కోటు తొడుక్కుంటారు దర్జాగా' అంటారు కొందరు.

వారికి తెలియదు. తన కోటు, లోపలి చొక్కాలోని ఎన్ని చిరుగులను బయటికి కనపడకుండా కప్పుతున్నదో!

ఎండ చిటచిట లాడుతున్నది. పెళపెళ లాడుతున్నది. సూర్యుడు చిర్రుబుర్రులాడుతున్నాడు. ఎండలో చురుకు అంతకంతకూ పెరుగుతున్నది.

రామచంద్రమూర్తి నుదుట పట్టిన చెమటను అరచేత్తో తుడుచుకుంటూ వీధి చివరకు కళ్లు చికిలించి చూశాడు, ఏదో బస్సు వస్తున్నది. దానిమీద వున్న నంబరు సరిగా కనిపించడం లేదు. అన్నట్లు ఈ మధ్య చూపు కొంచెం మందగించినట్టున్నది. చత్వారం వస్తున్నదేమో!

చత్వారం వొచ్చే వయస్సే మరి. ఎస్సెల్సీ రిజిష్టరులో వున్న తన పుట్టిన తేదీ నిజమే అయితే తనకిప్పుడు నలభై ఎనిమిది వెళ్లి రెండు నెలలయింది. ఇంకా ఏడేళ్లు సర్వీసున్నది.

బస్సు దగ్గరికి వచ్చాక కానీ నంబరు

## కథాంతరంగం



"అధికార రోగపూరిత బధిరాంధక శవము జూడ పాపము సుమతీ"

బద్దెన చెప్పనే చెప్పాడు. పైమెట్ల మీద వుండి నిమ్న స్థాయిలో తన కింద పనిచేస్తున్న వాన్ని - వాడు యితర రంగాలలో ఎంత ప్రతిభావంతుడైనా సరే - కక్షతో అనాగరికంగా ప్రవర్తించి బాధపెట్టే తరహా వాళ్లు వుంటారు. అట్లాంటి వాళ్లలో ఒకడ్ని నేను చూశాను. దురదృష్టవశాత్తు ఆ పనికిమాలిన వాడు నా బాల్యమిత్రుడు కావడంతో వాడి ఆఫీసుకు వెళ్లాను చాలా ఏళ్లకిందట.

నా ముందు తన పనికిమాలిన దర్జా వెలగబెట్టడం కోసం తన సబార్డినేట్‌ను పరమ క్రూరంగా మాటలతో హింసిస్తూ వుంటే ముళ్లమీద కూర్చున్నట్టు కూర్చున్నాను ఆ కాసేపూ. ఆ నిస్సహాయ మానవుడు ఎంతో కుంచించుకు పోయి వివరణను యిస్తున్నా వినకుండా ఘోరంగా మాటలతో హింసించిన ఆ మిత్రుడు యిప్పుడు లేడు. కానీ ఆనాటి వాడి ప్రవర్తన మీద ఏహ్యాభావంతో పుట్టుకొచ్చింది ఈ కథ. ఆనాడు ఆ నిస్సహాయుడు ఎవరో కానీ ఈ కథలో 'స్ప్రింటర్' అయినాడు. కథంతా కల్పనే.

మిత్రుడు జర్నలిస్టు, రచయిత కె.వి.ఎస్. వర్మ చాలా ఏళ్ల కిందట క్రీడల నేపథ్యంగా తెలుగులో ఎన్ని కథలు వచ్చాయి అని పరిశోధించి ఎనిమిదింటిని తేల్చారు. అందులో నావే నాలుగు వుండడంతో ఆశ్చర్యపోయాను. యిది నా కథలలో, నాకు నచ్చిన కథలలో ఒకటి.

సరిగా కనిపించలేదు అది తన బస్సు కాదు. పైగా బస్టాపు దగ్గరికి వచ్చాక స్పీడు పెంచి మరీ వేగంగా పోనిచ్చాడు డ్రైవర్. ఆ బస్సు ఎక్కవలసిన వారు కొంత దూరం దాని వెంట పరుగెత్తి ఇక ఆగదనీ నిర్ధారణ చేసుకుని ఉసూరుమంటూ తిరిగి వచ్చి మామూలుగా నిలబడ్డారు.

రామచంద్రమూర్తి ఆలోచిస్తూ నిలబడ్డాడు. తాను ఆఫీసుకు నడిచిపోతే ఎంత సేపటిలో పోగలడు? అని ఆలోచించాడు. బాగా వేగంగా నడవగలిగితే గంట, లేకపోతే యాభయి నిముషాలు పట్టవచ్చు. పరుగెత్తి పోతే? ఇప్పుడు తాను పరుగెత్తగలడా? ఒకప్పుడు పరుగెత్తాడు. రివ్వున గాలిలాగా, బాగా లాగి వొదిలిన బాణం లాగా పరుగెత్తాడు. చుట్టూ చేరిన వారు కరతాళ ధ్వనులు చేసి అభినందించారు. తమ జిల్లా పేరు నిలబెట్టాడని విపరీతంగా మెచ్చుకున్నారు. ఫొటోలు తీశారు. దండలు వేశారు.

తానప్పుడు రోజూ పరుగెత్తే వాడు. చీకటిఉండగానే లేచి పరుగు ప్రారంభించాడు. ఎక్కడా ఆగకుండా వేగంగా పరుగెత్తే వాడు. మైళ్ళ కొద్దీ దూరం అతని సన్నని కాళ్ళ క్రింద తరిగిపోయేది. ఆ కాళ్ళు ఇనుప కడ్డీలలా పొడవుగా ఉండేవి. ఆ కండరాలకు అలుపు తెలిసేది కాదు. ఇప్పుడు ఇంతకాలం తరువాత పరుగెత్త గలడా? జీవితంలో ఇంత అలసిపోయి ఇప్పుడు కేవలం పది బారల దూరం కూడా పరుగెత్తడం అనుమానమే.

పక్కనే నిలబడి వున్న వ్యక్తిని "ఏమండీ టైమెంత అయింది?" అని అడిగాతడతను. అతడు కొంచెం విసుగుతో చేతి గడియారం వంక చూసి "నైన్ ఫిఫ్టీ" అని సమాధానం చెప్పాడు.

నైన్‌ఫిఫ్టీ. బాప్‌రే. తాను పది గంటలకల్లా సీటులో ఉండాలి. లేకపోతే ఆ కొత్త ఆఫీసరు అగ్గి రాముడై పోతాడు. ఆయన అసలే ఫైర్ బ్రాండ్. పరమ చిరాకు మనిషి. ఎప్పుడూ అయినదానికి కానిదానికి ధుమధుమ లాడుతుంటాడు. వయసుకు చిన్నవాడే అంతతొందరగా ఎలా ప్రమోషన్లు సంపాయించాడో ఎవరికీ తెలియదు. చాలా డబ్బు ఖర్చు పెట్టాడని అంటారు. ఆయనకు తెలిసినవి రెండే విషయాలు. ఒకటి తాను పెట్టుబడి పెట్టిన మొత్తానికి నూరు రెట్లు పోగు చేసుకోడం. రెండు క్రింది వారందరి మీదా అనవసరంగా మండి పడుతూ అయిన దానికి కాని దానికి సాధిస్తూ ఆఫీసులో అద్భుతమైన క్రమశిక్షణ అమలు పరిచే గొప్ప ఆఫీసురుగా పేరు ప్రతిష్టలు పోగు చేసుకోవడం. ఈ రెండు ఆయన అద్భుతంగానే చేస్తున్నాడని చెప్పుకోవాలి. తన పెట్టుబడి కోసం తాపత్రయ పడడం ఒక ఎత్తు. సబార్డినేట్లును నానా హింసలు పెట్టడం ఒక ఎత్తు.





అసలా మనిషి ముఖం చూస్తూనే అదొక రకంగా ఉంటుంది. మనిషి లావుగా ఉంటాడు. మెడ అంతా కొవ్వు పట్టి ఉంటుంది. ఎవరి వంకనైన చూడదలచుకుంటే మెడ ఒక్కటీ తిప్పి చూడలేడు. మొత్తం శరీరమే గిర్రున తిరగవలసి వుంటుంది. కుర్చీకి నిండుగా సరిపడా వుంటాడు. జుట్టు కొంచెం తెల్లబడుతూ వుంటుంది. కళ్లు ఎర్రగా చింతనిప్పుల్లా వుంటాయి. కంఠ స్వరం సరేసరి మహాభయంకరంగా చిన్న పిల్లలు జడుసుకునేట్లు ఉంటుంది.


అది సరే ఇప్పుడు పది దాటుతున్నది కదా? ఈ బస్సు ఎప్పుడు వచ్చేట్టు? తానెలా ఎక్కేట్టు? ఎన్ని గంటలకు ఆఫీసుకు చేరుకునేట్టు? ఆఫీసరుకు ఏమి సంజాయిషి ఇచ్చుకునేట్టు?

అదుగో బస్సు. ఇంతకాలానికి దాని దర్శన మైంది. లోపల ఇటుకలు పేర్చినట్లు ప్రయాణికులు కిటకిటలాడుతున్నారు. అయినా దిగవలసిన వారి ద్దరు ముగ్గురు ఉండడం వల్ల అదృష్టం పండి ఆగింది. రామచంద్రమూర్తి కమ్మీ పట్టుకుని వదల్లేదు. దిగేవారు దిగగానే లోపలికి దూసుకు పోయాడు. బస్సెక్కడం అనే విద్యలో ఈ మాత్రపు ప్రాథమిక అనుభవమైనా లేకపోతే – ఆ సూట్ వాలాలాగా పేవ్‌మెంట్ మీదనే గంటల తర బడి నిలబడు.... నిలబడు... గంటల తరబడి నిలబడు. నీ చుట్టూ కొందరు దూసుకు పోతుంటారు... వాళ్ళే పైకి పోతుంటారు... నీ గతి యిక నిర్గతే.... 'టికెట్..... టిక్కెట్' అంటూ ఇద్దరూ ప్రయాణీకుల చంకల క్రింద నుంచి దూసుకు వచ్చాడు కండక్టరు అతి లాఘవంగా.

టికెట్ తీసుకుని నిలబడ్డాడు రామచంద్రమూర్తి.

వచ్చే ఫస్టు తారీఖున జీతం అందుకోగానే ముందు కళ్ళ డాక్టరు దగ్గరికి పోవాలి. బొత్తిగా చూపానడం లేదు. చదవ డమైతే మరీ కష్టంగా ఉంది. నాలుగు వాక్యాలు చదివితే చాలు కళ్ళవెంట నీళ్ళొస్తున్నాయి. తల నొప్పి పుడుతంది.

రామచంద్రమూర్తి అలాగే నిలబడ్డాడు.... అతని కళ్ళ ముందు యెప్పటిదో దృశ్యం కనిపించింది. తనకప్పుడు ఇరవై, యిరవై రెండేళ్లు ఉంటాయి. అప్పటికే మంచి రన్నర్‌గా పేరు తెచ్చుకు న్నాడు.



మరీ చిన్నపుడు తమ వూరికి నాలుగు మైళ్ళ దూరంలో వున్న చిన్నపట్నంలో స్కూలు చదువు. పొద్దున్నే లేచి చద్దన్నం తిని పుస్తకాల సంచీ భుజానికి తగిలించుకుని నడక ప్రారంభించాడు. సాయంకాలం తిరిగి వచ్చే టప్పుడు మరీ హుషారుగా ఉండేది. నాలుగు మైళ్ళు పరుగెత్తుకుంటూ తిరిగి వచ్చేవాడు. తోటివారిద్దరు సాయం కాలం అయ్యే సరికి నీరసపడి తోటకూర కాడల్లా వ్రేలాడి పోతుండే వారు. తాను వారిని వొదిలి రివ్వు రివ్వున పరుగెత్తుకు పోయేవాడు. ఆ విధంగా రన్నింగ్ అలవాటయింది. స్కూల్లో పోటీలలో తానే ప్రథముడు. దాంతో ఇంకా అభిరుచి పెరిగింది. ఎక్కడికి వెళ్ళినా పరుగెత్తుతూ వెళ్ళడమే. నడవటం అరుదై పోయింది. కాళ్లు సన్నబడ్డాయి.... కాళ్ళలో బలం సత్తువ పెరిగాయి. ఒళ్లు తేలికగా హాయిగా వుండేది. ఉదయమే లేచి మైళ్ళకొద్దీ పరు గెత్తి వస్తే ప్రాణానికి హాయిగా వుండేది.

బస్సు ఆగింది. రామచంద్రమూర్తి ఇద్దరు వ్యక్తులను నిర్దాక్షిణ్యంగా పక్కకు తోసి మళ్లీ జనారణ్యాన్ని ఛేదించుకొని క్రిందికి దిగాడు. క్షణంలో బస్సు వెళ్ళిపో యింది. టైమ్ కనుక్కున్నాడు. గుండె గతుక్కుమన్నది. నుదుటపట్టిన పడుతున్న చెమటను రుమాలుతో తుడుచుకుంటూ వేగంగా ఆఫీసుదారి పట్టాడు. మళ్లీ నడక... మరో అర ఫర్లాంగు దూరం.

ఎండ నియంత పరిపాలనలా భయంకరంగా వుంది. ఘోరంగా వుంది. భరిం చరానిదిగా వుంది.

ఆ రోజు...

అంతర్ జిల్లా ఎథ్లెటిక్స్ ముగింపు రోజు.... రన్నింగ్ ఫైనల్స్... ట్రాక్ అంతా శుభ్రంగా వుంది. అభ్యర్థులు మొత్తం పద్దెనిమిది మంది అందరూ పక్కనే పచ్చి కలో ఎగురుతూ, గెంతుతూ సన్నద్ధం అవుతున్నారు. బహుమతి ప్రదానం చేయ వలసిన కలెక్టరుగారు ఇతర ప్రముఖులతో కుర్చీలో కూర్చుని వున్నారు.

ఈ ఈవెంట్ కోసం తాను రోజూ ఉదయం సాయంకాలం ఆ గ్రౌండ్‌లోనే గంటల తరబడి పరుగెత్తాడు. ఈ సమయం కోసమే ఎదురు చూస్తున్నాడు. లౌడ్ స్పీకర్‌లలో మాటలు వినిపిస్తున్నాయి. పేర్లు వినిపిస్తు న్నాయి.

పద్దెనిమిది మంది ట్రాక్ మొద ట్లోకి వచ్చి నిలబడ్డారు. నేల మీదికి వంగారు. చేతులు నేల మీద ఆనించి సవ్వడి వినబడగానే ముందుకు రేసుగుర్రాల్లా దూసుకు పోయేందుకు సిద్ధంగా ఎక్కుపెట్టిన బాణాల వలె ఉన్నారు. కొద్ది క్షణాలు నిశ్శబ్దం....

మెత్తని ప్రేలుడు వినిపించగానే తాను ముందుకి దూకి పరుగు ప్రారం భించాడు. కళ్ళ ముందు ట్రాక్ తప్ప మనుషులు కనిపించడం లేదు. పక్క నున్న పచ్చని పచ్చిక కనిపించలేదు. పైనున్న నీలాకాశం కనిపించలేదు.

గుండెకు తగిలిన పలుచని దారం తెగిన తర్వాత కొద్ది గజాల దూరం పరుగెత్తిపోయి పచ్చికలో కూలబ డిపోయాడు. అంతలో తన చుట్టూ జనం మూగారు. తన చేతులు పట్టుకున్నారు. తనను కౌగలించుకున్నారు. చివరకు ఆయాసంతో వగర్చుతున్న తనను పైకెత్తి గాలిలోకి ఎగుర వేశారు.

కలెక్టరు తనకు ట్రోఫీ బహూకరిస్తున్నప్పుడు కరతాళ ధ్వను లతో ఆ ప్రదేశం అంతా మారు మ్రోగి పోయింది. 'ది ఫాస్టెస్ట్ రన్నర్ ఆఫ్ ది స్టేట్' అని సావనీర్‌లో ఫొటో క్రింద వ్రాశారు.

రామచంద్రమూర్తి ఆఫీసు మెట్లెక్కుతు న్నాడు. ఆయాసంతో వగరుస్తున్నాడు. నుదట, మెడ మీద పడుతున్న చెమటను తుడుచుకుంటున్నాడు. ఆ ట్రోఫీ యింకా తన దగ్గరే వుంది. దాన్ని ఇతర చిన్న చిన్నకప్పులు

వగైరా బహుమతులు దాచేందుకు తన దగ్గర అద్దాల బీరువాలు లేవు. కొన్ని అసలైన వెండి కప్పులు తనకు డబ్బు అవసరం వచ్చినప్పుడు వాటికి కాళ్ళొచ్చినట్టు వెండి దుకాణంలోకి వెళ్ళి చేరిపోయాయి. మరి రెండు మూడు కప్పులు లోపల ఎక్కడో ఉండాలి. ఆనాటి ట్రోఫీ మాత్రం పెద్దది. ఇప్పుడు ఇంట్లో కిటికీలో మూలగా ఉంటుంది. దుమ్ము కొట్టుకుపోయి ఉంటుంది. ఎన్నో సర్టిఫికెట్లు స్కూలు రోజుల నుంచీ తనకు వచ్చినవి పురుగులు కొట్టి పాడై పోయాయి. ముట్టుకుంటే పొడి పొడి అయ్యేట్టున్నాయి.

స్ప్రింగు డోరు తెరచుకుని లోపల అడుగు పెట్టేసరికి అయ్యగారు పేపరు చదువుతున్నారు. శబ్దం విని కుర్చీ మొత్తం పక్కకు తిప్పి గడియారం వంక చూసి మొహాన గంటు పెట్టుకుని పేపరు బల్ల మీదపడేసి ''ఊ'' అన్నాడు. ముందు భయంకరంగా... ఆ తర్వాత రామచంద్రమూర్తి రిజిష్టరు. అందుకోతూ వుంటే ''కాస్సేపాగండి – ఎలాగూ పన్నెండు అవుతుంది. ఈ పూటకు లీవు పెట్టేద్దురుగాని ––'' అన్నాడు.

తర్వాత మళ్ళీ అంతలోనే ''లీవు వుందా! అంతా వాడేసుకున్నారా?'' అని అడిగాడు.

రామచంద్రమూర్తి రిజిష్టరు మీద వున్న చేతిని వెనుక్కు తీసుకుని ''ఉందనే అనుకుంటానండి –'' అన్నాడు.

''గూడ్ – అది సరేనండి – మీరెన్నింటికి బయలు దేరుతారు ఇంటి నుంచి?''

''తొమ్మిందిటికి సార్!''

''గుడ్ – తొమ్మిదింటికి బయలుదేరి పదకొండు గంటలకు ఆఫీసుకొస్తారు. అంటే ఇక్కడికి రావడానికి రెండు గంటలు పడుతుంది – అంతేనా?''

''కాదండి... బస్సులతో బాగా ఇబ్బందిగా ఉందండి – బస్సులు ఆపరు. ఎక్కించుకోరు''.

''గూడ్... కాబట్టి మనకు బస్సు సరిపడదని అర్థం – అంతేనా?''

రామచంద్రమూర్తి తలవంచుకున్నాడు.

''గూడ్ – బస్సు మీద వస్తే లాభం లేదని తెలిశాక మీరు వేరే వసతి చూసుకోవాలి.... అంటే మరో రవాణా సౌకర్యం... మరో మీన్స్ అఫ్ కన్వేయన్స్ – పోనీ ఒక స్కూటరు కొనుక్కోగూడదు?''

రామచంద్రమూర్తి నవ్వేందుకు ప్రయత్నించాడు. ''డబ్బు కావాలి కదండీ'' అన్నాడు.

''గూడ్ – డబ్బు లేదు కాబట్టి కారు, స్కూటరు వగైరాలు వీల్లేదు – ఆగవు ఎక్కించుకోవు కాబట్టి బస్సు వీల్లేదు... మరి కొంచెం ముందుగా – ఎనిమిదింటికి యింటి దగ్గరే బయలు దేరితే ...''

''అప్పటికి యింట్లో వంటకాదండి''

''ఓహో.... అదొకటా? కాబట్టి అదీ వీలులేదు. సరే... ముందు లీవ్ లెటరు రాయండి. ఈ లోపల నేను ఉపాయం ఆలోచిస్తాను.''

రామచంద్రమూర్తి కాగితం అందుకుని ఈ పూటకు లీవ్ వ్రాసి యిచ్చాడు. అది రాస్తున్నంత సేపు ఆఫీసరు అతనివంక తమాషాగా అలవోకగా హేలగా చూస్తూ కూర్చున్నాడు.

ఆ తర్వాత దాన్ని అందుకుని అవతలపెట్టి ''ఆఁ? ఉపాయం తట్టింది... అది బెస్టు––'' అన్నాడు.

రామచంద్రమూర్తి తలెత్తి అతని మొహంలోకి



చూశాడు. అతడు నవ్వుతున్నాడు.

''చెప్పండి సార్ –'' అన్నాడతను.

''అవును... అది బెస్టు... మీరు తొమ్మిందిటికే ఇంటి దగ్గర బయలుదేరవచ్చు. పదింటికల్లా ఆఫీసుకు చేరుకోవచ్చు, పైగా వొంటికి ఎంతో మంచిది. ఆరోగ్యం బాగుంటుంది. ఎంతో మంచి ఎక్సర్‌సైజ్''

''చెప్పండి సార్''

''తొమ్మిదింటికి ఇంట్లో నుంచి బయటకు రండి – వెంటనే పరుగు ప్రారంభించండి. స్పీడుగా పరుగెత్తండి. ఎక్కడా ఆగకండి – అరగంటలో ఆఫీసులో ఉంటారు. ఏమంటారు?''

ఈ మాటలని అతడు నవ్వడం ప్రారంభించాడు. తన మాటలకు తానే బల్లమీద పడి పడి నవ్వాడు నవ్వి నవ్వి ముఖం ఎర్రబడింది. కళ్ళ వెంట నీళ్ల తిరిగాయి.

రామచంద్రమూర్తి మొహం జేవురించింది. వ్రేళ్ల వొణికాయి – కోపంతో మనిషి నిలువెల్లా ఊగిపోయాడు.

కొంచెంగా కంపిస్తున్న కంఠంతో ప్రారంభించాడు. ''మీ ధోరణి ఏమీ బాగా లేదండి... పరమ వెకిలిగా వుంది. మీ హోదాకు తగినట్టు లేదు. నేను మీకంటే వయసులోనూ అనుభవంలోనూ పెద్దవాణ్ణి, మీరు అలా మాట్లాడకూడదు. అలా మాట్లాడకూడదని తెలుసుకునేపాటి సంస్కారం మీ చదువైనా మీకు యివ్వలేదూ, అయామ్ సారీ... రియల్లీ సారీ... ఈ వయసులో మీలాటి మనిషిని కలుసుకోవడం, మీ కింద పని చేయడం నా దౌర్భాగ్యమనుకుంటాను. వ్యంగ్యం హాస్యం ఇవేనని, ఇలాగే ఉంటాయనీ మీరనుకుంటే అది తప్పు. ఎక్కడో ఎప్పుడో మీ జోక్ మిమ్మల్ని దెబ్బతీస్తుంది. మీ సెన్సాఫ్ హ్యూమర్ ఎప్పుడో మిమ్మల్ని దెబ్బ తీస్తుంది''.

ఈ మాటలని వెనుదిరిగి వెళుతూ ఆగి అతనివంక చూస్తూ మళ్ళీ ''అన్నట్టు మీకు తెలియదేమో. పరుగెత్తమని నాకు సలహా యిచ్చారు. ఐవజ్ ఏ ఫేమస్ రన్నర్ వన్స్. మీకు తెలియకపోతే నన్ను గురించి మరెవరినైనా స్పోర్ట్స్ తెలిసిన వారిని వాకబు చేయండి.... చెబుతారు.... వస్తాను'' అని స్ప్రింగ్ డోరు మూసి యివతలకి వచ్చాడు.

***

ఆ సాయంకాలం ఆఫీసు నుంచి బయటపడి రామచంద్రమూర్తి నుదురు చేత్తో రుద్దుకున్నాడు.

వాతావరణం చల్లబడింది. చల్లనిగాలి వీస్తున్నది. అతడు బస్సు కోసం ఆగలేదు. వేగంగా నడవడం ప్రారంభించాడు.

ఈ ప్రాంతంలో పెద్ద ఆవరణ వుంది. ప్రభుత్వ స్థలం. అక్కడ రోజూ కొందరు యువకులు రన్నింగ్ ప్రాక్టీస్ చేస్తూ ఉంటారు.

అక్కడే నిలబడిపోయాడు కొద్ది నిముషాలు.

తర్వాత మళ్ళీ నడక ప్రారంభించాడు. అతడిప్పుడు బొత్తిగా జన సంచారం లేని వీధుల వెంట నడుస్తున్నాడు. అతనికి పరుగెత్తాలని సరదా పుట్టింది. ప్యాంట్ కొంచెం పైకి మడిచాడు. కోటు చేతులు పైకి మడిచాడు.

''రన్... రన్...'' అనుకున్నాడు. వేగంగా పరుగెత్తాడు.

అలా తమ వీధికి చేరుకునే వరకు పరుగెత్తుతూనే వున్నాడు. మధ్యలో సెంటర్లలోను జనం ఎదురైతేనూ తప్ప ఆగలేదు.

ఆయాసంతో వగర్చుతూ యింటికి వచ్చిపడ్డాడు. మంచం మీద కూలబడి పోయాడు. సీతమ్మ ఆదురాగా ''ఏమిటండీ... అంతగా ఆయాసపడి పోతున్నారేమిటి?'' అంటూ వచ్చింది.

ఆయాసంలోనే ''ఏమీ లేదు... మంచినీళ్లు... వద్దు... కాఫీ'' అన్నాడు. ఆమె లోపలికి వెళ్ళింది. అతడు కాళ్ళు చాపి మంచంలో వెల్లకిలా పడుకున్నాడు.

అయిదు నిమిషాల తర్వాత ఆమె వచ్చి చూసి అదిరిపడింది. భర్త వాలకం ఆమెకు అర్థం కాలేదు. భయంతో పరుగెత్తుకు వెళ్లి దగ్గర్లోనే ఉన్న డాక్టరును పిలుచుకొచ్చింది. ఆయన పరీక్షచేసి ''కంగారేమీ లేదు... చిన్న పెరాలసిస్ స్ట్రోక్... అదే పక్షవాతం.... కుడికాలు చెయ్యి పడిపోయాయి... విశ్రాంతిగా పడుకోనివ్వండి... నేను మళ్ళీ వచ్చి చూస్తాను. ప్రాణభయం ఏమీ లేదు. తొందరలో కాలూ చెయ్యి మామూలుగానే వస్తాయి'' అని చెప్పి వెళ్ళిపోయాడు.

రామచంద్రమూర్తి కళ్ళలో నీళ్లు ఉబికివచ్చి బుగ్గల మీదుగా కిందికి జారుతున్నాయి. అతని కళ్లలో ఒకటే దృశ్యం.... ఆ నాటి దృశ్యం... ఎత్తయిన ట్రోఫీ... గుండెల్లో ధ్వనులు.....

''రన్.... రన్ రామూ.... రన్''

''ది'' ఫాస్టెస్ట్ రన్నర్ ఆఫ్ ది స్టేట్''.

''రన్.... రన్... రన్... మైడియర్ బాయ్... రన్''.

*